

పార్లమెంట్‌లో ప్రాంతీయ భాషలను గుర్తించి గౌరవించాలని ఆమదాలవలస మండలం గాజులకొల్లివలసకు చెందిన సైకత శిల్పి గేదెల హరికృష్ణ సైకత శిల్పం ద్వారా కోరారు. పార్లమెంట్ సమావేశాల్లో తెలంగాణకు చెందిన కాంగ్రెస్ పార్టీ ఎంపీ రేవంత్ రెడ్డి భాషను కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ హేళన చేస్తూ వ్యంగ్యంగా మాట్లాడటం తగదన్నారు. సైకత శిల్పంలో పార్లమెంట్, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ఎంపీ రేవంత్ రెడ్డి సైకత శిల్పాలను వేశారు. పార్లమెంట్‌లో ప్రాంతీయ భాషలను గుర్తించి, గౌరవించాలని సైకత శిల్పం ద్వారా తెలియజేస్తున్నట్లు తెలిపారు.

- ప్రజాశక్తి, ఆమదాలవలస

చలిపులి పంజా

- ఆస్పత్రులకు రోగుల తాకిడి
- అప్రమత్తంగా ఉండాలంటున్న వైద్యులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

చలిపులి పంజా విసురుతోంది. వారం రోజులుగా పగటి ఉష్ణోగ్రతలు తగ్గడంతో పాటు . ఉదయం, సాయంత్రం సమయాల్లో పొగ మంచు కమ్మేస్తోంది. ఉదయం 8గంటల వరకు పొగమంచు వీడడం లేదు. రాత్రి పూట మంచు కురుస్తుండడంతో ఒక్కసారిగా ఉష్ణోగ్రతలు తగ్గాయి. దీంతో వృద్ధులు, చిన్నారులతోపాటు దీర్ఘకాలిక వ్యాధులున్న వారు, పోస్టు కోవిడ్ నుంచి కోలుకున్న వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జలుబు, దగ్గు, శ్వాస కోశ సంబంధిత వ్యాధులు, ఆస్తమా, బ్రాం కైటిస్, నియోనియాతో బారినపడిన వారికి తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. శీతాకాలంలో ఆరోగ్యపరంగా కొన్ని జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాల్సిందేనని వైద్యనిపుణులు సూచిస్తున్నారు. గతంలో కోవిడ్ బారినపడి కోలుకున్న వారు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిస్తున్నారు. వీటికి తోడు చర్మ సంబంధిత వ్యాధులు, ఇన్ఫెక్షన్లతో సతమతం అవుతున్నారు. జిల్లాలో ఉష్ణోగ్రతలు తగ్గుతుండడంతో దగ్గు, జ్వరాలతో ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులకు రోగుల తాకిడి పెరుగుతోంది.

ఇవీ ఇబ్బందులు

జిల్లాలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు క్రమంగా పడిపోతున్నాయి. చలి కారణం గా సాధారణ ఇబ్బందులతోపాటు చర్మ సంబంధిత సమస్యలు వస్తున్నాయి. చర్మం పొడిబారి పోవడంతో పాటు దురదలు, ఎలర్జీలు, దద్దుర్లు, నీటి కురుపులు వంటివి వేధిస్తున్నాయి. చర్మం పొడిబారి పగిలిపోతోంది. సోరియాసిస్ రోగులకు మరింత ఇబ్బందులు ఎదురవుతున్నాయి. స్నానం చేసేముందు కొబ్బరినూనె, వెన్న రాసుకుంటే చర్మంపై తేమశాతం ఉంటుందని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

తీరం ప్రాంతంలో చలి తీవ్రత అధికం

జిల్లాలో 193 కిలో మీటర్ల పొడవున సముద్ర తీరం విస్తరించి ఉంది. 11 మండలాల్లోని అనేక గ్రామాలు తీరానికి చేరువలో ఉన్నాయి. తీరం వెంబడి ఉష్ణోగ్రతలు తగ్గడంతో చలి వణికిస్తోందని చెపుతున్నారు. ఉదయం, సాయంత్ర సమయాల్లో వాకింగ్, జాగింగ్ చేసేవారు మంచు వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

పెరుగుతున్న ఒపి సంఖ్య

నగరంలోని జిజిహెచ్‌తో పాటు నగరంలోని ప్రైవేటు ఆసుపత్రులకు ఆస్తమా , ఫ్లూ, కఫంతో కూడిన దగ్గు, శ్వాసకోశ సమస్యలతో రోగుల సంఖ్య పెరుగుతోంది. క్షయ రోగుల్లో ఈ తీవ్రత మరింత ఎక్కువగా కనిపిస్తోంది. శ్వాసకోశ సమస్యలతో గతంలో జిజిహెచ్‌కు సుమారు వంద మంది వరకు ఒపి ఉండేది. కానీ వారం రోజుల్లో ఒపికి రోగుల సంఖ్య ఘననీయంగా పెరిగింది. ప్రస్తుతం ఆ సంఖ్య 125 నుంచి 150 వరకూ చేరువవుతోంది. టిబి రోగుల్లో దగ్గు అధికంగా ఉండటం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని జిల్లా క్షయనివారణాధికారి డాక్టరు ఎన్.అనురాధ తెలిపారు. జలుబు, దగ్గు, రొంప, తలనొప్పి తదితర వాటితో వస్తున్న రోగుల సంఖ్య కూడా గతం కంటే ఘణనీయంగా పెరిగిందని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి.



పొందూరు : రాపాక కూడలి వద్ద మంచులో వెళ్తున్న వాహనాలు



జి.సిగడాంలో దట్టంగా కురుస్తున్న మంచు

మరింత అప్రమత్తంగా ఉండాలి



చలికాలంలో చిన్నారులు, వృద్ధులు మరింత అప్రమత్తంగా ఉండాలి. ముఖ్యంగా నిమోనియా వచ్చే ప్రమాదముంది. నిత్యం వేడి పదార్థాలను మాత్రమే తీసుకోవాలి. కోవిడ్ నుంచి కోలుకున్న వారు మాస్కు ధరిస్తే మేలు. వీరికి ఆయాసం వచ్చే అవకాశం ఉంది. ఊపిరితిత్తుల సమస్యలు ఎదురవుతాయి. జాగ్రత్తలు పాటించాలి. ఇన్ఫెక్షన్ కారణంగా నిమోనియా వస్తుంది. దీని వల్ల జ్వరం, దగ్గు, జలుబు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు ఎదురవుతాయి. చిన్నారులు, వృద్ధులు బయటకు వెళ్లకుండా ఉండడం తోపాటు చల్లని పదార్థాలను తీసుకోకూడదు.

- డాక్టర్ జి.చంద్రశేఖర్, ఊపిరితిత్తుల వైద్యులు

సూచనలు ఇవీ...

- చలికాలంలో శీతల పదార్థాలకు దూరంగా ఉండాలి. వేడిగా ఉండే వాటిని తినాలి.
- మంచులో తిరగడం తగ్గించాలి. అత్యవసరమైతే మాస్కులు ధరిస్తే మేలు.
- శీతాకాలంలో చాలామంది తక్కువ నీరు తాగుతారు. అలాకాకుండా ఎక్కువ తాగితే లోపల పేరుకుపోయిన కఫం బయటికి వస్తుంది.
- నిమోనియా రాకుండా చిన్నారులు, పెద్దలు టీకాలు వేయించుకోవాలి.
- పొగ తాగేవారికి బ్రాం కైటిస్ వచ్చే ప్రమాదముంది. చలికాలంలో పొగతాగడం మానుకోవాలి.
- శరీరానికి వెచ్చ దనం ఇచ్చే దుస్తులు వేసుకోవాలి.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు

సిపిఎస్‌పై మాట తప్పొద్దు

- ఇచ్చిన హామీ ప్రకారం రద్దు చేయాలి
- రద్దు చేసే వారి వైపే ఉద్యోగ, ఉపాధ్యాయులు
- ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు
- యుటిఎఫ్ ఆధ్వర్యాన 5కె వాక్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

అధికారంలోకి వస్తే కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సిపిఎస్) విధానాన్ని రద్దు చేస్తామని హామీనిచ్చిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి, అధికారంలోకొచ్చాక మాట తప్పారని ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు విమర్శించారు. సిపిఎస్, జిపిఎస్ వద్దు... ఒపిఎస్ అమలు చేయాలని కోరుతూ యుటిఎఫ్ ఆధ్వర్యాన ఆదివారం 5కె వాక్ చేపట్టారు. శ్రీకాకుళం నగరంలోని పిఎస్ఎన్ఎం హైస్కూల్ నుంచి ఏడు రోడ్ల కూడలి, డేఅండ్‌నైట్ కూడలి మీదుగా తిరిగి ఆ స్కూల్ వద్దకే నిర్వహించిన వాక్‌లో పెద్దసంఖ్యలో ఉద్యోగ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేట్లకు మాత్రమే లాభాన్ని చేకూర్చే సిపిఎస్‌ను రద్దు చేయాల్సిందేనని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఎస్‌కు ప్రత్యామ్నాయంగా తీసుకొచ్చిన జిపిఎస్ విధానమూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఏమాత్రం లాభదాయకం కాదని స్పష్టం చేశారు. కార్పొరేట్లకు లాభాన్ని చేకూర్చే ఈ విధానాలను రద్దు చేయాలని, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించడానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రతిపక్ష నేతగా జగన్ ఎన్నికల హామీగా వారం రోజుల్లో సిపిఎస్‌ను రద్దు చేస్తామని ఇచ్చిన హామీని అమలు చేయకుండా, సిపిఎస్‌ను రద్దు చేయాలని పోరాడుతున్న ఉపాధ్యాయులపై ప్రత్యేకించి యుటిఎఫ్ నాయకులపై కేసులను బనాయించడం, భయపెట్టే చర్యలు తగవన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ జీతాల నుంచి కంట్రిబ్యూషన్ కట్టించుకుంటూ పెన్షన్ చెల్లించే విధానాన్ని ఇక అంగీకరించబోమన్నారు. ఎన్నికల హామీ ఇవ్వని ఛత్తీస్‌ఘడ్, రాజస్థాన్, పంజాబ్ మరికొన్ని రాష్ట్రాల్లో సిపిఎస్‌ను రద్దు చేసి... ఒపిఎస్ విధానం అమలుకు విధివిధానాలను రూపొందిస్తూ చట్టాలు చేయడానికి సిద్ధమవుతున్నాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా పాత పెన్షన్ విధానం అమలుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సిపిఎస్‌ను రద్దు చేసే వారి వైపు ఉద్యోగ, ఉపాధ్యాయులు ఉంటారని స్పష్టం చేశారు. రానున్న కాలంలో పెద్దఎత్తున సిపిఎస్ ఉద్యోగులు, ఉపాధ్యాయుల కుటుంబ సభ్యులతో పోరాట కార్యక్రమం చేపడతామని చెప్పారు. అందులో భాగంగా ప్రతి సిపిఎస్ ఉద్యోగి, ఉపాధ్యాయుని ఇంటికి వెళ్లి సిపిఎస్, జిపిఎస్ వల్ల వచ్చే నష్టాలను వివరించి కుటుంబ సభ్యులందరినీ ఉద్యమంలో భాగస్వామ్యం చేసే విధంగా చైతన్యపరిచే కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి చౌదరి రవీంద్ర, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.అప్పారావు, ఎస్.కిషోర్ కుమార్, సిపిఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా కన్వీనర్ జి.నారాయణరావు, యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు జి.గిరిధర్, ఆర్.మోహనరావు, జిల్లా సహాధ్యక్షులు ఎల్.బాబూరావు, బి.ధనలక్ష్మి, కోశాధికారి బి.శ్రీరామ్మూర్తి, కార్యదర్శులు కె.రమేష్ కుమార్, ఆర్.పరమేశ్వరరావు, ఎం.వి రమణ, రాష్ట్ర కౌన్సిలర్లు వై.ఉమాశంకర్, ఎస్.నారాయణరావు, జి.కోదండరావు, కె.వి శ్రీరామ్మూర్తి, ఉద్యోగులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేపట్నుంచి మూడో జోన్ గ్రిగ్స్ పోటీలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

అంతర్ పాఠశాలల గ్రిగ్స్ పోటీల్లో భాగంగా మూడో జోన్‌కు సంబంధించిన జోనల్ స్థాయి పోటీలు ఈనెల 20 నుంచి 23వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి జి.పగడాలమ్మ, గ్రిగ్స్ కార్యదర్శి ఎస్.తిరుమల చైతన్య, సంయుక్త కార్యదర్శి కె.మాధవరావు ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీకాకుళం, నరసన్నపేట నియోజకవర్గాలతో కూడిన జోనల్ స్థాయి పోటీలను పోలాకి మండలం మబగాంలోని జెడ్‌పిహెచ్ స్కూల్ వేదికగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. నాలుగు రోజుల పాటు నిర్వహించే ఈ పోటీలను విజయవంతం చేయాలని కోరారు. నరసన్నపేట, శ్రీకాకుళం నియోజకవర్గాల్లోని జలుమూరు, సారవకోట, నరసన్నపేట, పోలాకి, శ్రీకాకుళం రూరల్, శ్రీకాకుళం అర్బన్, గార మండలాలకు చెందిన వారై ఇటీవలి మండల స్థాయి గ్రిగ్స్ పోటీల్లో జూనియర్స్, సీనియర్స్ కబడ్డీ, ఖోఖో, వాలీబాల్‌లో విజేతలు, రన్నర్స్‌గా నిలిచిన జట్లు, క్రీడాకారులతో పాటు అథ్లెటిక్స్ క్రీడాకారులు హాజరు కావాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 99637 53717 ఫోన్ నంబరును సంప్రదించాలని జోనల్ స్థాయి సమన్వయకర్త వై.పోలినాయుడు సూచించారు.

మార్చి నాటికి కిడ్నీ రీసెర్చ్ సెంటర్ పూర్తి



శంకుస్థాపన చేస్తున్న మంత్రి అప్పలరాజు

- కెటి రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేసి కానుకగా ఇస్తా
- అనుకున్న సమయానికి ఆఫ్‌షోర్ పూర్తి చేస్తాం
- రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు

ప్రజాశక్తి - పలాస

వచ్చే మార్చి నాటికి కిడ్నీ 200 పడకల ఆస్పత్రి, కిడ్నీ రీసెర్చ్ సెంటర్‌ను పూర్తి చేసి ప్రారంభించనున్నట్లు రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు తెలిపారు. ఇంటింటికీ కుళాయి ద్వారా తాగునీరు సరఫరా చేసేందుకు రూ.వంద కోట్ల వ్యయంతో చేపడుతున్న పనులకు ఆదివారం శంకుస్థాపన చేశారు. అనంతరం కాశీబుగ్గ సంత మైదానంలో పలాస మున్సిపల్ చైర్మన్ బి.గిరిబాబు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఆఫ్‌షోర్ రిజర్వాయర్ అనుకున్న సమయానికి పూర్తి చేసి పంట భూములకు సాగునీరు అందిస్తామని చెప్పారు. పలాస-కాశీబుగ్గ కెటి రోడ్డు విస్తరణ పనులను త్వరలో పూర్తి చేసి మున్సిపాలిటీకి కానుకగా ఇస్తామన్నారు. కాశీబుగ్గ ఫ్లైఓవర్ నిర్మాణ పనులు 2007లో ప్రారంభించినా గత ప్రభుత్వాలు విస్మరిస్తే, తాను మున్సిపల్ ఎన్నికల అనంతరం బాధితులకు నష్టపరిహారం చెల్లించడంతో పాటు ఇళ్ల స్థలాలు కేటాయించానని చెప్పారు. త్వరలోనే ఫ్లైఓవర్‌నూ పూర్తి చేస్తామని చెప్పారు.

ప్రతి ఇంటికీ తాగునీరు అందించాలనే ఉద్దేశంతో రూ.వంద కోట్లు కేటాయించామని, త్వరగా పనులు పూర్తి చేసి ప్రతి ఇంటికీ తాగునీరు అందించాకే ఎన్నికల సమయంలో ఓట్లు అడిగేందుకు వస్తామన్నారు. వైసిపి హయాంలో పలాసలో డిగ్రీ కళాశాల మంజూరైందని, ప్రస్తుతం తరగతులూ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పలాస ప్రాంతంలో 60 ఏళ్లుగా పరిపాలన చేస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్న నాయకులు ఏ అభివృద్ధి చేస్తారో చెప్పాలంటూ ప్రశ్నించారు. శిలాఫలకం ప్రాంతంలో మార్పు పద్మనాభం, పొట్టి శ్రీరాములు, సర్దార్ వల్లభాయ్ పటేల్, బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహాలను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఈనెల 21న ఎనిమిదో తరగతి విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం ట్యాబ్‌లు పంపిణీ చేయనుందని చెప్పారు. జనవరి 29న డ్వాక్రా మహిళలకు వైఎస్ఆర్ ఆసరా కింద మూడో విడత డబ్బులు జమ చేస్తుందన్నారు. అనంతరం మంత్రి అప్పలరాజు, మున్సిపల్ కమిషనర్ టి.రాజగోపాల్‌ను సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మీసాల సురేష్‌బాబు, బోర బుజ్జి, మున్సిపల్ మాజీ చైర్మన్ కోత పూర్ణచంద్రరావు, పలాస అభివృద్ధి కమిటీ చైర్మన్ డబ్బీరు భవానీ శంకర్, ఎఎంసి చైర్మన్ పి.వి సతీష్, విశాఖ పబ్లిక్ హెల్త్ ఎస్ఇ కె.రాజారావు, డిఇ కె.హరి, ఎఇ అవినాష్, ఎంపిపి ప్రతినిధి ఉంగ సాయికృష్ణ, పిఎసిఎస్ అధ్యక్షులు పైల వెంకటరావు చిట్టి, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

అరసవల్లికి రూ.5.50 లక్షల ఆదాయం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయానికి ఆదివారం రూ.5.50 లక్షల ఆదాయం సమకూరింది. ఆలయ ప్రవేశానికి టిక్కెట్ల విక్రయాల ద్వారా రూ.2,33,800, ఇతర సేవలు, విరాళాల రూపంలో రూ.57,015, ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.2.60 లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి వి.హరి సూర్యప్రకాష్ తెలిపారు. విజయనగరం జిల్లా రాజాం పట్టణానికి చెందిన బత్తుల మహేశ్వరరావు, సూర్యకుమారి దంపతులు వారి మనవడు సాయివిస్మృత్ పేరిట రూ.లక్ష విరాళంగా అందజేశారు. కేశఖండన శాఖ నిర్మాణానికి శ్రీకాకుళం నగరానికి చెందిన వి.నారాయణమూర్తి, వాణి దంపతులు రూ.లక్ష విరాళంగా అందజేశారు. ఆలయ ఇఒ హరి సూర్యప్రకాష్‌ను కలిసి చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ, ఆలయ ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్ కె.వెంకటేశ్వరరావు, ఆలయ జూనియర్ అసిస్టెంట్ బి.ఎస్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.



విరాళాన్ని అందజేస్తున్న బి.మహేశ్వరరావు

ప్రాథమిక స్థాయి నుంచే సెమిస్టర్ విధానం

- తరగతుల నిర్వహణపై దృష్టి
- ప్రభుత్వ ఆదేశాల అమలు తప్పనిసరి
- సమర్థవంతంగా బదిలీల ప్రక్రియ
- జిల్లా విద్యాశాఖాధికారి గార పగడాలమ్మ



ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

రాష్ట్ర వ్యాప్తంగా విద్యా విధానంలో వస్తున్న మార్పుల్లో భాగంగా ప్రాథమిక స్థాయి నుంచి సెమిస్టర్ పరీక్షల విధానం వచ్చే విద్యా సంవత్సరం ఉనంచి అమల్లోకి రానుంది. అందులో భాగంగా పాఠశాల విద్యాశాఖ నుంచి జిఒ విడుదలైందని జిల్లా విద్యాశాఖాధికారి గార పగడాలమ్మ తెలిపారు. అందుకు తగ్గట్టుగా విద్యా విధానంలో సరికొత్త మార్పులు రానున్నట్లు చెప్పారు. క్షేత్రస్థాయి నుంచి విద్యను మరింత బలోపేతం చేసేందుకు దోహదపడుతుంది. పాఠశాలల్లో ఇప్పటికే నాడు నేడు ద్వారా మౌలిక వసతులు సమకూర్చాం. ఉపాధ్యాయులు సమయపాలన వల్ల తరగతుల నిర్వహణ క్రమం తప్పకుండా జరుగుతున్నాయి. విద్యార్థుల్లో ఆసక్తి పెంచడం ద్వారా పోటీ తత్వం అలవాటు చేయడం జరుగుతోంది. వార్షిక పరీక్షలకు మూడు నెలల సమయం ఉంది. అత్యంత కీలకంగా ఉన్న ఈ సమయాన్ని విద్యార్థులు సద్వినియోగ పరచుకుంటే మంచి ఫలితాలు సాధించొచ్చు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి సెమిస్టర్ విధానం అమలు, టెన్త్ పరీక్షలు, ఉపాధ్యాయ బదిలీలు తరతర విషయాలను ఆమె ప్రజాశక్తి ముఖాముఖిలో వివరించారు.

సెమిస్టర్ విధానం అమలుకు ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

పాఠశాల విద్యలో సమూల మార్పులు తీసుకురావడం జరుగుతోంది. అందులో భాగంగానే పరీక్షల విధానంలో కొన్ని మార్పులకు ప్రభుత్వం సిద్ధమైంది. 1-9 తరగతుల విద్యార్థులకు వచ్చే విద్యా సంవత్సరం నుంచి రెండు సెమిస్టర్ల విధానం అమలు చేయనున్నాం. ప్రభుత్వం ఇచ్చిన జిఒను అనుసరించి పరీక్షల విధానంలో మార్పులు రానున్నాయి. గతంలో వార్షిక పరీక్షల వరకు విద్యార్థి సృజనాత్మకత తెలియడం కష్టమయ్యేది. కాని ఇప్పుడు ఎప్పటికప్పుడు సెమిస్టర్ పూర్తకాగానే విద్యార్థి ఎలా చదువుతున్నాడో అంచనా వేయడం సులభమవుతుంది. తద్వారా మరింత దృష్టి సారించడానికి వీలుందన్నారు.



ఈ ఏడాది టెన్త్ పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు ఎలా సాగుతున్నాయి?

జిల్లాలో 3128 ప్రభుత్వ పాఠశాలల్లో 624 ఉన్నత పాఠశాలల్లో పది పరీక్షలకు విద్యార్థులు సిద్ధమవుతున్నారు. మరో మూడు నెలల గడువు ఉండటం వల్ల ఈ సమయం విద్యార్థులకు అత్యంత కీలకం. అందువల్ల చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపాల్సి ఉంది. విద్యార్థులకు ఆ దిశగా తరగతుల నిర్వహణకు ప్రణాళికలు సిద్ధం చేశాం.ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు. ఉత్తీర్ణత శాతం మెరుగు పడటంతో పాటు నాణ్యమైన విద్యను అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యం. తరగతుల నిర్వహణతో పాటు పరీక్షల నిర్వహణపై దృష్టి సారించడంలో ఉపాధ్యాయులది కీలక పాత్ర. విజయమే లక్ష్యంతో ప్రతి ఒక్కరూ శ్రద్ధగా చదువుతున్నారు. ప్రభుత్వం నుంచి అందిస్తున్న ప్రోత్సాహకాలు, సంక్షేమ పథకాలు విద్యార్థుల అభివృద్ధికి తోడ్పడతాయి. తల్లిదండ్రులు ఒత్తిడి లేకుండా పిల్లలను చదివించాలి.

విలీన ప్రక్రియ ఎంత వరకు వచ్చింది?

జిల్లా వ్యా ప్తంగా ప్రాథమిక పాఠశాలల్లోని 3, 4, 5 తరగతుల విద్యార్థుల విలీన ప్రక్రియ పూర్తయింది. ఉన్నత పాఠశాలల్లో విలీనం చేయడం జరిగింది. 3 కిలోమీటర్ల పరిధిలోని పాఠశాలల విలీనానికి సంబంధించి ప్రభుత్వానికి నివేదించాం. వెయ్యి మంది కంటే ఎక్కువ విద్యార్థులున్న పాఠశాలల్లో విలీన ప్రక్రియ జరపవద్దని ఆదేశాలు ఉన్నాయి. అందులో భాగంగా కసరత్తు పూర్తయింది.

మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ, పర్యవేక్షణ ఎలా సాగుతోంది ?

మధ్యాహ్న భోజన పథకం నాణ్యతగా, రుచికరంగా విద్యార్థులకు చేరువవుతోంది. మార్చి 1 నుంచి ప్రభుత్వం కొత్త మెనూ అమలు చేయడం వల్ల విద్యార్థులకు సుచికరమైన పోషకాహార విలువలతో కూడిన ఆహారం అందించడం జరుగుతోంది.

బదిలీల ప్రక్రియ ఎలా సాగుతోంది?

జిల్లాలో ప్రభుత్వ నిబంధనలు అనుసరించి బదిలీల ప్రక్రియ మొదలైంది. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకునేందుకు వీలు కల్పించాం. 20వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలి. నిబంధనలకు లోబడి ఆన్‌లైన్‌లోనే బదిలీలు జరగనున్నాయి. అందుకోసం పాఠశాల విద్యాశాఖ చర్యలు చేపట్టింది. ఎనిమిదేళ్ల పాటు ఒకే చోట పనిచేస్తున్న ఉపాధ్యాయులకు బదిలీ తప్పనిసరి. ప్రధానోపాధ్యాయులకు, రేషనలైజేషన్‌లో ఉన్న వారికి స్థాన చలనం జరుగుతోంది.

సెమిస్టర్ విధానంతో విద్యార్థులకు మేలు

ప్రజాశక్తి - ఆమదాలవలస

పాఠశాల విద్యలో సెమిస్టర్ విధానం నిర్ణయం వల్ల విద్యార్థులకు ఎంతో ప్రయోజనం కలగనుందని వైసిపి నాయకులు, ప్రొఫెసర్ చింతాడ రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి తొమ్మిదో తరగతికి రెండు సెమిస్టర్లు, 1 నుంచి ఐదు తరగతులకు మూడు సెమిస్టర్లు, 2024-25 నాటికి 6 నుంచి 10 తరగతులకు సెమిస్టర్ విధానం అమలు చేయడం వల్ల విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఒత్తిడి తగ్గి మెరుగైన విద్యా బోధన సాధ్యమవుతుందని పేర్కొన్నారు. అభ్యాసన జరగడమే కాకుండా విద్యార్థులు ఎన్నో అధునాతన సబ్జెక్టులను నేర్చుకోవడానికి వీలు కలుగుతుందని తెలిపారు. ఉన్నత విద్యలో సెమిస్టర్ విధానం ఇప్పటికే మన దేశంలో అమల్లో ఉందని గుర్తుచేశారు. ఈ విధానంతో విద్యార్థులు కొత్త సబ్జెక్టులు నేర్చుకోవడమే కాకుండా, తమకు నచ్చిన విభాగంలో పాఠశాల విద్య నుంచే ప్రావీణ్యత సంపాదించే అవకాశం లభిస్తుందని తెలిపారు. రాష్ట్రంలో విద్యా విధానంలో సమూల మార్పులు తీసుకొచ్చి, భావితరాలకు విలువలతో కూడిన మంచి విద్యను అందించాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వినూత్న కార్యక్రమాలు చేపడుతున్నారని కొనియాడారు. నాడు-నేడు, అమ్మఒడి, విద్యా దీవెన, వసతి దీవెన, వసతి దీవెన, గోరు ముద్ద, పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి కార్యక్రమాలు అందులో భాగమేనని తెలిపారు. రాష్ట్రంలోని విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తున్నారని తెలిపారు. ఏ కార్యక్రమం చేసినా టిడిపి, జనసేన, ఎల్లో మీడియాలు విమర్శిస్తూనే ఉంటాయని, ఆ విష ప్రచారాలను ప్రజలు నమ్మనవసరం లేదని పేర్కొన్నారు.



చింతాడ రవి

రాష్ట్రంలో అరాచక పాలన

- మాచర్ల ఘటనే అందుకు నిదర్శనం
- టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

రాష్ట్రంలో అరాచక పాలన కొనసాగుతుందని, అందుకు గుంటూరు జిల్లా మాచర్లలో జరిగిన విధ్వంస కాండే నిదర్శనమని టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ ధ్వజమెత్తారు. ఆదివారం సాయంత్రం టిడిపి జిల్లా కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. టిడిపికి పెరుగుతున్న ఆదరణ, ప్రభుత్వంపై పెరుగుతున్న వ్యతిరేకతను భరించలేక శాసనసభ్యుడు పిన్నెల్లి రామకృష్ణ ఒక పథకం ప్రకారం టిడిపి శ్రేణులపై దాడికి పాల్పడ్డారని ఆరోపించారు. మాచర్ల టిడిపి ఇన్‌ఛార్జి బ్రహ్మారెడ్డిపైనా, ఆయన అనుచరులపైన వైసిసి నాయకులు దాడులు చేయడం వెనుక జగన్ ఫ్యాక్షన్ ముఠా హస్తముందని ఆరోపించారు.

టిడిపి నాయకులైన బోండా ఉమాపై దాడి ఉద్దేశ పూర్వకమేనని అన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని చెప్పటానికి ఈ ఘటనే అందుకు నిదర్శనమన్నారు. తప్పుడు కేసులు, దాడులు, హత్యా రాజకీయాలతో జగన పాలన సాగుతోందని విమర్శించారు. ఈ దాడులను ప్రజాస్వామ్య వాదులు ఖండించాలన్నారు. మాచర్ల ఘటనపై విచారణ చేయాలని డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న కూన రవికుమార్



చేనేత వస్త్రాన్ని పరిశీలిస్తున్న కూర్మారావు

చేనేత మహిళలకు చేయూత

ఎపిఎం కూర్మారావు

ప్రజాశక్తి- ఆమదాలవలస

మహిళా స్వయంశక్తి సంఘాల్లో చేనేత వృత్తి గల కుటుంబ సభ్యుల ఆదాయాన్ని పెంచుకోవడానికి అవసరమైన పనిముట్లు, కావాల్సిన యంత్రాలు సమకూర్చుకోవడానికి బ్యాంకర్ విల్లింగ్ ఇస్తే పిఎంఇజిపి పథకాన్ని వర్తింప చేయిస్తామని వైఎస్ఆర్ క్రాంతి పథం అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు అన్నారు. మండలంలోని అక్కివరం పంచాయతీ గోపీనగర్ పాఠశాలలో చేపడుతున్న నాడు-నేడు పనులను ఆదివారం పరిశీలించారు. అనంతరం గ్రామంలోని చేనేత పనులను పరిశీలించారు. సంక్రాంతికి ఉన్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకొని పెట్టుబడికి అవసరమైతే గ్రామ సంఘాల ద్వారా రుణాలను సమకూర్చాలని గ్రామ సంఘం అధ్యక్షులు రేణుకకు సూచించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మీరు తయారు చేసిన వస్త్రాలకు మీ గ్రామ సంఘాల ద్వారా మండల సమాఖ్య పరిధిలో మార్కెటింగ్ సౌకర్యాన్ని కల్పిస్తామన్నారు. ప్రభుత్వం ఇప్పటికే మగ్గం నేస్తున్న కుటుంబాలకు వైఎస్ఆర్ నేతన్న నేస్తం పథకాన్ని సచివాలయాల ద్వారా అమలు చేస్తుందని వివరించారు. స్వయం శక్తి సంఘాల్లో నేతన్న నేస్తం లబ్ధిదారులకు ఎవరికైనా మీ వృత్తి ఉపాధి అవకాశాలను మెరుగుపర్చుకోవడానికి అవసరమైన పెట్టుబడి సమకూర్పునకు మీ సంఘాల ఇంటర్నల్ లెండింగ్ ద్వారా పొదుపు నుంచి అప్పులు, తరువాత గ్రామ సంఘాల ద్వారా స్త్రీనిధి రుణాలను మంజూరు చేయిస్తామని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సంఘం ప్రతినిధులు, విఒఎ రాజేశ్వరి, క్లస్టర్ కో-ఆర్డినేటర్ రమణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పూర్వ ఉపాధ్యాయుడు ముఖలింగం

ఆనాటి జ్ఞాపకాలు మధురస్మృతులే

ప్రజాశక్తి- సోంపేట

ఆనాటి జ్ఞాపకాలు ఎప్పటికీ మధురస్మృతులేనని (1986-87) నాటి పూర్వ విద్యార్థులు, పూర్వ అధ్యాపకులు పేర్కొన్నారు. సోంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల 1986- 87 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. 35 ఏళ్ల తర్వాత మిత్రులంతా కలుసుకుని చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. నాడు తమకు విద్యాబుద్ధులు నేర్పిన లెక్కలు ఉపాధ్యాయుడు జోగారావు, సోషల్ ఉపాధ్యాయుడు ముఖలింగం, సైన్స్ ఉపాధ్యాయుడు వెంకటరావు, ఒరియా ఉపాధ్యాయుడు సురేష్ శ్చంద్ర చౌదరిలను ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు దుశ్శాలువ కప్పి, ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పూర్వ ఉపాధ్యాయులు మాట్లాడుతూ క్రమశిక్షణతో తమ వద్ద విద్య నేర్చుకుని ఉన్నత స్థాయిలో స్థిరపడిన విద్యార్థులకు అభినందనలు తెలిపారు. ఏ స్థాయికి ఎదిగినా కుటుంబంతో పాటు తల్లిదండ్రులను బాధ్యతగా చూసుకోవాలన్నారు. సామాజిక సేవలో తమ వంతు సహకారం అందించి సమాజ అభివృద్ధికి పాటుపడాలని పిలుపునిచ్చారు. సమావేశానికి అధ్యక్షత వహించిన ఉట్ల మనోజ్‌కుమార్ మాట్లాడుతూ 1986-87 సంవత్సరంలో పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు 95 మంది ఉన్నారని, వారిలో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి, అనారోగ్యంతో బాధపడుతున్న వారికి ఇప్పటికే సహాయం చేశామని, భవిష్యత్‌లోనూ ఈ బ్యాచ్ సహాయ, సహకారాలు అందిస్తుందన్నారు.

ఘనంగా ఎంపీ జన్మదినం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

పార్లమెంట్ సభ్యులు కింజరాపు రామ్మోహన్ నాయుడు జన్మదిన వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. నగరంలోని ప్రజా సదన్‌లో నిర్వహించిన ఈ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి, కోటబొమ్మాళి నాయకులు కింజరాపు హరిప్రసాద్‌లు కేక్‌ను కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. పేదలకు దుస్తులను, దుప్పట్లను పంపిణీ చేశారు. న్యూ శ్రీకాకుళం బ్లడ్ బ్యాంకులో మెండ దాసునాయుడు ఆధ్వర్యాన రాము సేన రక్తదానం చేశారు. అంతకుముందు బెహరా మనో వికాస కేంద్రం, వృద్ధ జనాశ్రమం, సర్వజనాస్పత్రి తదితర ప్రాంతాల్లో పేదలకు పళ్లు, మిఠాయిలు పంచిపెట్టారు. వేడుకల్లో కొర్ను ప్రతాప్, బసవ నాని, బసవ రాజేష్, దుంగ భాస్కర్, సంతోష్, జైశ్రీరామ్, చందు శ్రీకాంత్, రవి, పండా సాయి, లక్ష్మణ్, నాయుడు, సన్నీ, సురేష్, ధనుంజయ్, శ్రీనివాసరావు, జాడ సాయి, న్యూ శ్రీకాకుళం బ్లడ్ బ్యాంకు మేనేజర్ మణికంఠరావు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి : ఎంపీ జన్మదినం సందర్భంగా టిడిపి మండల అధ్యక్షులు బోయిన రమేష్ కొత్తమ్మతల్లి ఆలయంలో రామ్మోహన్‌నాయుడు పేరున పూజలు చేశారు. అనంతరం కేక్‌ను కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి తర్ర రామకృష్ణ, ఎంపిటిసి పట్ట సింహాచలం, వెలమల విజయలక్ష్మి, కామేశ్వరరావు, కర్రి అప్పారావు, నంబాళ శ్రీనివాసరావు, సాసుమంతు ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

కింజరాపు యువసేన ఆధ్వర్యాన కోటబొమ్మాళి, నరసన్నపేటల్లో ఉన్న వృద్ధాశ్రయాల్లో వృద్ధులకు పళ్లు, స్వీట్లు, భోజనాలు పంపిణీ చేశారు. అలాగే స్థానిక కొత్తమ్మతల్లి ఆలయం ముందు ఉన్న యాచకులకు భోజనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా తెలుగు యువత ఆర్గనైజేషన్ సెక్రటరీ దాసరి కృష్ణవర్ధన్ (కిట్టు), కింజరాపు యువసేన సభ్యులు పాల్గొన్నారు.

పొందూరు: మండలంలో రాపాకలో ఎంపీ పుట్టిన రోజు సందర్భంగా కేక్ కట్‌చేసి, మిఠాయిలను పంచిపెట్టారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు బి.శంకరభాస్కరరావు, కె.రమేష్, కె.అప్పలనాయుడు, పి.వాసుదేవరావు, కె.సన్యాసిరావు, కె.మోహనరావు, కె.కృష్ణారావు, చింత మహేష్, గణపతిరావు, శ్రీనివాసరావు, స్వామినాయుడు, సీతంనాయుడు పాల్గొన్నారు.

పోలాకి : మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ఆధ్వర్యాన శ్రీకాకుళం ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు జన్మదిన వేడుకలు ఆదివారం నిర్వహించారు. టిడిపి కార్యాలయంలో పుట్టిన రోజు కేకును కోసి, కార్యకర్తలకు పంచిపెట్టారు. అనంతరం వృద్ధాశ్రమంలో, వసతిగృహ విద్యార్థులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కోటబొమ్మాళి : కేక్ తినిపిస్తున్న రమేష్



వజ్రపుకొత్తూరు : కేక్ కట్ చేస్తున్న టిడిపి నాయకులు

ఇచ్ఛాపురం: టిడిపి పట్టణ అధ్యక్షులు కాళ్ల ధర్మారావు ఆధ్వర్యాన రామ్మోహన్‌నాయుడు పుట్టిన రోజు సందర్భంగా స్వేచ్ఛావతి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కార్యకర్తలు, నాయకుల సమక్షంలో కేకు కోసి, పంచిపెట్టారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి సాలీనా ఢిల్లీ యాదవ్, రాష్ట్ర బిసి సాధికారత కమిటీ కన్వీనరు కొండ శంకర్‌రెడ్డి, దక్కత ఢిల్లీరావు, నాయకులు కాళ్ల జయదేవ్, నందిక జాని, ఆసి లీలారాణి, నందిగాం కోటేశ్వరరావు, కామేశ్వరరావు, జిలానీ, గీలయి కృష్ణ, బోర ప్రసాద్, లోహిదాస్, తదితరులు పాల్గొన్నారు.


మెళియాపుట్టి: మండలంలో పెద్ద లక్ష్మీపురంలో టిడిపి మహిళా ఉపాధ్యక్షులు బూర్ల లలితకుమారి ఆధ్వర్యాన ఎంపీ పుట్టిన రోజు సందర్భంగా రాధాకృష్ణ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కేకును కోసి పంచిపెట్టారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు భాస్కర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి ఉల్లాన వసంత్, కృ ష్ణారావు, మాజీ ఉపసర్పంచ్ బిర్లంగి ఢిల్లీరావు, ఎం.తిరుపతిరావు, మాలతి శ్రీధర్, చక్రి, పరమేశ్‌రెడ్డి, పడాల శ్రీను పలువురు టిడిపి నాయకులు, అభిమానులు కార్యకర్తలు పాల్గొన్నారు.

సోంపేట: పట్టణంలోని గాంధీ మండపం కూడలి వద్ద ఎంపీ పుట్టిన రోజు కేకును టిడిపి నాయకులు కోసి, పంచిపెట్టారు. కార్యక్రమంలో నాయకులు ఎస్.చంద్రమోహన్, బి.ఆనంద్, సిహెచ్ శేఖర్, గోవింద్‌రెడ్డి, ఆర్ శ్రీను, ఎం.యుగంధర్, పి.రవి, డి.ప్రకాష్, జై పురుషోత్తం పాల్గొన్నారు.

కంచిలి: స్థానిక రాధాకృష్ణ మందిరం వద్ద టిడిపి నాయకులు ఎంపీ బర్త్‌డే కేక్ కట్ చేసి, మిఠాయిలు పంచిపెట్టారు. అనంతరం దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మి, నాయకులు మాదిన రామారావు, కామేష్‌రెడ్డి, జగదీష్ పట్నాయక్, మర్రిపాటి పూర్ణచంద్ర, పిలక చినబాబు, రమేష్‌రెడ్డి, వూన రవికుమార్, టివి.రమణ, ఎంఎం పట్నాయక్, పురుషోత్తంరెడ్డి, బొడ్డ రాంకుమార్, బొడ్డ హరిబాబు, తదితరులు పాల్గొన్నారు.



శ్రీకాకుళం అర్బన్ : కేక్ తినిపిస్తున్న మాజీ ఎమ్మెల్యే లక్ష్మీదేవి



పొందూరు : కేక్‌ను కట్ చేస్తున్న నాయకులు

పలాస: పలాస, మందస మండలాల్లోని టిడిపి కార్యాలయాల్లో శ్రీకాకుళం ఎంపీ జన్మదిన వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి టిడిపి నాయకులు, కార్యకర్తలు పంచిపెట్టారు. కార్యక్రమంలో టిడిపి పలాస మండల అధ్యక్షుడు కుత్తుం లక్ష్మణ్‌కుమార్, కార్యదర్శి దువ్వాడ సంతోష్‌కుమార్, వంకల కూర్మారావు, సారా కుమార్, రట్టి లింగరాజు, దుర్యోధన, దాసరి తాతారావు టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు : శబరిమల యాత్రలో ఉన్న మండల టిడిపి నాయకులు కాణిపాకం వరసిద్ధివినాయక ఆలయం ప్రాంగణంలో గోవిందపురం పిహెచ్‌సి అభివృద్ధి కమిటీ చైర్మన్ పుచ్చ ఈశ్వరరావు ఆధ్వర్యాన ఎంపీ జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్‌ను కట్ చేసి అక్కడున్న యాత్రికులు పంచిపెట్టారు. కార్యక్రమంలో కర్ని రమణ, గోవింద పాపారావు, దున్న షణ్ముఖరావు, షణ్ముఖరావు పాల్గొన్నారు.

ఎంపీ జన్మదినం సందర్భంగా పాతపట్నం ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు టిడిపి నాయకులు మామిడి గోవిందరావు పళ్లు, నవజీవన్ ట్రస్టులో ఉన్న వికలాంగులకు పళ్లు పంపిణీ చేశారు.

జాతి మరిచిన జాతిరత్నం 'గరిమెళ్ల'

పోలాకి : జాతిమరిచిన జాతిరత్నం గరిమెళ్ల సత్యనారాయణ అని గరిమెళ్ల ట్రస్టు ప్రధాన కార్యదర్శి బాడాన రాజు అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడు గరిమెళ్ల సత్యనారాయణ 70వ వర్ధంతిని పురస్కరించుకొని ఆయన స్వగ్రామం ప్రియాగ్రహారంలో ఆయన విగ్రహానికి పూలమాలేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ నేటి తరం స్మరించుకునే విధంగా గరిమెళ్ల జయంతి, వర్ధంతి వేడుకలను ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించాలని, ఆయన పేర స్మారక మందిరం నిర్మించాలి అని డిమాండ్ చేశారు. మాకొద్దీ తెల్లదొరతనం గేయాన్ని 6వ తరగతి తెలుగు పుస్తకంలో పాఠ్యాంశంగా ప్రభుత్వం చేర్చడం గర్వకారణమని అన్నారు. దాతలు, పెద్దలు ముందుకొచ్చి గరిమెళ్ల విగ్రహ పునర్నిర్మాణానికి సహకరించాలని కోరారు. త్వరలో ఆయన పేర తపాలా ముద్రికను విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఐ.గణపతిరావు పాడిన మాకొద్దీ తెల్లదొరతనం గేయం అందరినీ ఆకట్టుకుంది. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు డి.కోటేశ్వరరావు, డి.కోటేశ్వరరావు, గరిమెళ్ల యూత్ సభ్యులు బెవర శివ, నెయ్యిల ప్రసాద్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.



విగ్రహానికి పూలమాలలు వేస్తున్న రాజు

క్రైమ్ కార్నర్



మృతుని కుటుంబసభ్యులతో మాట్లాడుతున్న పోలీసులు

టైరు బండిని ఢీకొని వ్యక్తి మృతి

పోలాకి : మండలంలోని రేవు అంపలాంకు చెందిన ఉషికొండ అనంతరావు (49) టైరు బండిని ఢీకొని మృతి చెందిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు... ఉదయం 6 గంటలు సమయంలో ఉరజాం నుంచి అంపలాం మీదుగా పల్లిపేట వైపు నాటుబండి వెళ్తుంది. పోలాకి కేంద్రం నుంచి అనంతరావు, కోటిపల్లి పెంటయ్య బైక్‌పై స్వగ్రామం అంపలాం వెళ్తున్నారు. మార్గమధ్యంలో అంపలాం వద్ద ఎదురుగా వస్తున్న బండిని ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో అనంతరావు తీవ్రంగా గాయపడడంతో ప్రమాదస్థలంలోనే మృతి చెందగా, పెంటయ్య గాయపడ్డాడు. వెంటనే స్థానికులు 108లో జిల్లా సర్వజనాస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుమారుడు రామారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ నరశింహామూర్తి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తికి గాయాలు



చికిత్స పొందుతున్న వీరభద్రరావు

బూర్జ : మండలంలోని ఎం.ఎల్.పురం కూడలి సమీపంలో ఆదివారం సంభవించిన రోడ్డు ప్రమాదంలో తూతిక వీరభద్రరావు గాయపడ్డాడు. సమాచారం అందుకున్న 108 సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని ఇఎంటి శ్రీనివాసరావు, మల్లేశ్వరరావు ప్రథమ చికిత్స నిర్వహించి జిల్లా సర్వజనాస్పత్రికి తరలించారు. వీరభద్రరావు పాలకొండలోని ఓ వివాహానికి వెళ్లి తిరిగి ఉప్పినివలసలో బంధువుల ఇంటికి వెళ్తామని తన ద్విచక్ర వాహనంతో వస్తుండగా మార్గమధ్యం ఎం.ఎల్.పురం వద్దకు వచ్చే సరికి నిద్ర రావటంతో బైక్ అదుపు తప్పి బోల్తా పడడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. శ్రీకాకుళం పట్టణానికి చెందిన ఆయన వస్త్ర వ్యాపారం చేస్తున్నారు.



ఖానాను ఢీకొన్న కారు

తప్పిన ప్రమాదం

కోటబొమ్మాళి: మండలంలోని హరిశ్చంద్రపురం ఆర్అండ్‌బి రహదారిలో ఆదివారం మధ్యాహ్నం ప్రమాదం తప్పింది. పోలాకి మండలం మెరియబెల్లిపేట నుంచి విశాఖపట్నం వెళ్తున్న ఒక కారు హరిశ్చంద్రపురం రోడ్డులో అదుపు తప్పి పక్కన ఉన్న ఖానాకు ఢీకొంది. కారు మలుపు వద్దకు వచ్చే సరికి ముందు చక్రం పంచర్ కావడంతో అదుపు తప్పి తుప్పల్లో దూసుకెళ్లి ఖానాను ఢీకొంది. కారు డ్రైవర్, యజమాని అప్రమత్తం కావడంతో కుటుంబం ప్రమాదం నుంచి బయటపడ్డారు. దీంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. కారులో నలుగురు ప్రయాణిస్తున్నారు.

యువత శ్రమదానం

పొందూరు: మండలంలోని కింతలిలో యువత ఆధ్వర్యాన ఆదివారం 'స్వచ్ఛ కింతలి-స్వచ్ఛ స్వర్గ దామం' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున యువకులు పాల్గొని శ్మశానవాటిక చుట్టూ పెరిగిపోయిన పిచ్చిమొక్కలను తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా చేశారు. గ్రామ పెద్దలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



శ్రమదానం చేస్తున్న యువకులు



వరికి క్రిమిసంహారక మందును పిచికారీ చేస్తున్న రైతు

చి'వరి'కి కష్టాలు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

ఖరీఫ్ చి'వరి' దశలోనూ రైతులకు కష్టాలు వీడడం లేదు. మూడేళ్లుగా వంశధార నీరు శివారు భూములకు అందడం లేదు. దీంతో పంట వేసుకోవడంలో రైతులకు సమస్యలు ఎదురవుతున్నాయి. ఈ ఏడాది వంశధార నీరు అందకపోయినా సెప్టెంబర్ చివరి వారంలో భారీ వర్షాలతో సీతాపురం ఎర్ర చెరువు, పెద్దబొడ్డపాడు రామసాగరం నిండుకున్నాయి. దీంతో రైతులు ఆలస్యంగా పంటలు వేసుకున్నారు. ప్రభుత్వం స్టోర్‌ల ద్వారా ఇంద్ర 1061 రకం వరి వంగడాలను అందించారు. అయితే అవి నకిలీ విత్తనాలు కావడంతో పంట చేతికి అందుకొచ్చిన పరిస్థితి లేదు. మరో 20 రోజులు తరువాత పంట కోతకు వస్తుందని రైతులు చెబుతున్నారు. పంట పచ్చదనం కారణంగా తెగుళు కారణంగా వరి కంకులు పొలంలోనే రాలిపోతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వంశధార నీరు సకాలంలో అందకపోవడం వల్లే మూడేళ్లుగా ఇదే పరిస్థితి ఎదుర్కొంటున్నామని రైతులు చెబుతున్నారు. పంటకు తెగుళ్లు ఆశించడంతో పురుగు మందుల పిచికారికి వేలల్లో ఖర్చవుతుందని అంటున్నారు. ఇప్పటికే వరిలో పెట్టుబడులు తడిసిమోపెడు అయ్యాయని రైతులు వాపోతున్నారు.

ఇన్సూరెన్స్ అందించాలి



మూడేళ్లుగా వంశధార నీరు శివారు భూములకు అందడం లేదు. వరుస కరువులతో రైతులు అల్లాడుతున్నారు. నకిలీ విత్తనాలు నష్టం కలిగించాయి. ఈ సమయంలో రైతులకు ఇన్సురెన్స్ అందించి ఆదుకోవాలి. మదుపులు పెరిగి రైతులు నష్టాలు చవిచూస్తున్నారు.

- తమ్మినాన తాతయ్య, రైతు, పెద్దబొడ్డపాడు

కెఆర్ స్మారక గ్రంథాలయం సందర్శన



పుస్తకాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్


ఎచ్చెర్ల మండలం ఫరీదుపేటలో కొత్తకోట రామలక్ష్మి స్మారకార్థం నెలకొల్పిన గ్రంథాలయాలన్ని ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు ఆదివారం సందర్శించారు. జిల్లా పర్యటనకు వచ్చిన సందర్భంగా గ్రంథాలయాన్ని సందర్శించి వ్యవస్థాపకులు కొత్తకోట అప్పారావును ప్రశంసించారు. గ్రంథాలయంలో 1,500 పుస్తకాలు, కాంపిటేషన్స్ పరీక్షలకు అవసరమైన ఇతర పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని, వీటిని పరిసర ప్రాంతంలోని యువత చదువుకుని విజయాలను సొంతం చేసుకోవాలని అన్నారు. రామలక్ష్మి ఉపాధ్యాయురాలిగా ఎంతో మందికి విద్యాబుద్ధులు నేర్పించారని, ఎంతో మంది యువకులు ఆమె దగ్గర చదుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించారని పేర్కొన్నారు. ఆమె మన మధ్య లేకపోయినా చదువును అందించాలన్న ఆమె సంకల్పం గట్టిదన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ పర్యవేక్షకులు కొత్తకోట అచ్యుతరావు, యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

గ్రిగ్స్‌లో లిఖిత సత్తా

సోంపేట: ఇసుకలపాలెం ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని లిఖిత గ్రిగ్స్ పోటీల్లో ప్రతిభ కనబర్చినట్లు జయలక్ష్మి తెలిపారు. మండలంలోని బ్రాహ్మణతర్లాలో జరిగిన జోనల్ స్థాయి పోటీల్లో వంద మీటర్ల పరుగు పందెం విభాగంలో లిఖిత విజేతగా నిలిచిందని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినిని హెచ్ఎంతో పాటు పీడీ పి.మనీషా, ఉపాధ్యాయులు టి.మురళి, పి.కుమారస్వామి, రాజారావు, రవికుమార్ అభినందించారు.



అభినందిస్తున్న హెచ్ఎం జయలక్ష్మి, ఉపాధ్యాయులు



పనులను పరిశీలిస్తున్న మధు

బోర్లకు మరమ్మతులు


ప్రజాశక్తి- పొందూరు

మండలంలోని వి.ఆర్.గూడెంలో సర్పంచ్ సువ్వారి అమ్మాయమ్మ ఆధ్వర్యాన పలుచోట్ల పాడైపోయిన తాగునీటి బోర్లకు ఆదివారం మరమ్మతులు చేపట్టారు. గ్రామంలోని సచివాలయం, అంగన్వాడీ కేంద్రాల సమీపంలో తాగునీటి బోర్లు పాడైపోవడంతో వాటికి మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకొచ్చారు. తాగునీటి బోర్లకు మరమ్మతులు చేపట్టడంపై గ్రామస్తులు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి సువ్వారి మధు, వైస్ సర్పంచ్ ప్రతినిధి సువ్వారి గోవిందరావు పాల్గొన్నారు.

ముగిసిన 'క్లాప్' వారోత్సవాలు

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం

క్లీన్ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా పురపాలక సంఘం ఆధ్వర్యాన నిర్వహించిన క్లాప్ వారోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. వారం రోజులుగా వార్డుల్లో అవగాహనా ర్యాలీలు, సదస్సులు నిర్వహించారు. ముగింపు సందర్భంగా ప్రజల్లో పరిశుభ్రత గురించి అవగాహన కల్పించేందుకు భారీ ర్యాలీ, బస్టాండ్ వద్ద ఆదివారం మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా సామూహిక ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ భారతిదివ్య, మున్సిపల్ మేనేజర్ హరిమోహన్, 8వ వార్డు కౌన్సిలర్ మధుమూర్తి, ఇన్‌ఛార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉపేంద్ర, మున్సిపల్ సిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

మాజీ ఎంపిటిసి లోకనాథం మృతి

ఆప్తమిత్రునికి అశ్రునివాళులర్పించిన ఎమ్మెల్యే అశోక్

ప్రజాశక్తి- కవిటి

కవిటి మాజీ ఎంపిటిసి, టిడిపి సీనియరు నాయకులు పొల్లాయి లోకనాథం(61) శనివారం రాత్రి గుండెపోటుతో మరణించారు. సాయంత్రం వరకు పార్టీ శ్రేణులతో పాటు ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఆకస్మిక మరణంతో ఎమ్మెల్యే అశోక్‌తో పాటు టిడిపి నాయకులు శోక సంద్రంలో మునిగిపోయారు. సమాచారం అందుకున్న వెంటనే ఆయన ఇంటికి చేరుకున్నారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.

లోకనాథానికి శనివారం రాత్రి 11గంటల సమయంలో గుండెపోటు వచ్చింది. కుటుంబ సభ్యులు ఆయనను స్థానిక ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే ఆయన మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. ఈయన 2006-11 వరకు కవిటి ఎంపిటిసిగా పనిచేశారు. ఆయనకు భార్య ఢిల్లమ్మ, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు రాము ఉన్నారు. హైదరాబాద్‌లో ఉన్న కుమారునికి సమాచారం అందించారు. ఆప్తమిత్రుడైన లోకనాథం అంత్యక్రియల ఏర్పాట్లను ఎమ్మెల్యే అశోక్ దగ్గరుండి పర్యవేక్షించారు. లోకనాథం పార్టీకి, తనకు అండగా నిలిచిన సందర్భాలను గుర్తు చేసుకున్నారు. ఆయన మృతదేహాన్ని సందర్శనార్థం ఉంచారు. అనంతరం లోకనాథం కుమారుడు రాముతో కలిసి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. తన ఆప్తమిత్రుడి పాడె మోసి అశ్రునివాళులర్పించారు. కవిటి సర్పంచ్ పూడి లక్ష్మణరావు, పిఎసిఎస్ మాజీ అధ్యక్షుడు పులకల శ్రీరాములు, కవిటి అగ్నికుల క్షత్రియ సంఘం నాయుడు పొల్లాయి లక్ష్మణమూర్తి, టిడిపి నాయకులు బెందాళం రమేష్, సీపాన వెంకటరమణ, మణిచంద్ర ప్రకాష్, బాసుదేవ్ రౌలో, సంతోష్ పట్నాయక్, పుల్లట రాజు, స్థానిక ఉషోదయ యువజన సంఘం సభ్యులు లోకానాథం మృతదేహాన్ని సందర్శించి, పూలమాలేసి, నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.



లోకనాథం పాడె మోస్తున్న ఎమ్మెల్యే అశోక్

దశాబ్దాల కల నెరవేరింది

మున్సిపల్ మాజీ చైర్మన్ కోత పూర్ణచంద్రరావు

ప్రజాశక్తి- పలాస



పూర్ణచంద్రరావు

రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డితోనే సాధ్యమని, పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో ఇంటింటికి తాగునీరు సరఫరా పథకం మంజూరు వల్ల దశాబ్దాల కల నెరవేరిందని మాజీ మున్సిపల్ చైర్మన్ కోత పూర్ణ చంద్రరావు అన్నారు. కాశీబుగ్గలోని తన స్వగృహంలో విలేకరులతో ఆయన మాట్లాడారు.

మున్సిపాలిటీలో సుమారు 20 వేల నివాస గృహాలు, 45 వేల ఓటర్లు, సుమారు 60వేల జనాభా కలిగి ఉన్న మున్సిపాలిటీలో శాశ్వత మంచినీటి సమస్య పరిష్కారం కోసం తాను మున్సిపల్ చైర్మన్ చేస్తున్న సమయంలో ఢిల్లీ వెళ్లి అక్కడి ఉన్నత అధికారులతో మున్సిపాలిటీ తాగునీటి సమస్యపై చర్చించడం జరిగిందన్నారు. ఇక్కడి నీటి ఎద్దడిపై అధికారులకు వివరించినట్లు తెలిపారు. 2018 డిసెంబర్ 7వ తేదీన ఆసియన్ ఇన్‌ఫ్రా ఇన్వెస్ట్మెంట్ బ్యాంక్(ఎఐఐబి) రూ.100 కోట్లు రుణం మంజూరు చేసిందన్నారు. ఇంటింటికీ తాగునీరు సరఫరా చేసేందుకు రూ.36 కోట్లు విఇఎల్ సిఒ కన్స్ట్రక్షన్స్ ద్వారా టెండర్లు వేసి రాష్ట్ర పశుసంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు చేతుల మీదుగా శంకుస్థాపన చేయడం చాలా ఆనందంగా ఉందన్నారు. మంచినీటి సమస్యకు శాశ్వత పరిష్కారానికి మార్గం చూపించినందుకు మంత్రి అప్పలరాజుకు, సిఎం జగన్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

200 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

శ్రీకాకుళం మండలం లింగాలవలసలో సన్‌రైజ్ ఆస్పత్రి ఆధ్వర్యాన ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలు దీర్ఘకాలిక జ్వరం రక్త హీనత, కాలుష్య లోపంతో బాధపడుతున్నారని అన్నారు. అలాగే బిపి, సుగర్ వ్యాధులపై జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో మొక్కలు నాటి 200 మందికి ఉచితంగా రక్త పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాసరావు, పెద్దలు, సన్‌రైజ్ ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.



రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి శ్రీనివాసరావు

కొరగాంలో అన్నదానం

బూర్జ : మండలంలోని కొరగాంలో మజ్జి అప్పలనాయుడు, కాగితాపల్లి జనార్ధనరావు, గ్రామస్తుల ఆధ్వర్యాన ఆదివారం షిరిడీ సాయి బాబా ఆలయ ప్రథమ వార్షికోత్సవం నిర్వహించారు. ఈ వార్షికోత్సవానికి టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ పాల్గొన్నారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



వివాహం చేసుకున్న ప్రేమ జంట

పెద్దల సమక్షంలో ప్రేమ వివాహం

పలాస : మండలంలోని గురుదాసుపురం గ్రామానికి చెందిన ఆర్మీ ఉద్యోగి సొర్ర ప్రశాంత్, చిన్న గురుదాసుపురం గ్రామానికి చెందిన మద్దిల వాణి కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. వీరిద్దరి కులాలు వేరైనప్పటికీ పెద్దలు, ఇరు కుటుంబాల సమక్షంలో ఆదివారం గురుదాసుపురంలో వివాహం జరిగింది. సర్పంచ్ ప్రతినిధి కుత్తుం లక్ష్మణకుమార్, పలాస మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ జినగ లోకేశ్వరి ఆధ్వర్యంలో జరిగిన ఈ వివాహానికి ఇరు గ్రామాల కులపెద్దలు హాజరయ్యారు. కార్యక్రమంలో సొర్ర ఢిల్లీరావు, సొర్ర రామారావు, మడియా వాసు, సొర్ర కామేష్, జినగ పురుషోత్తం, సుధీర్, ఢిల్లీరావు, జనగ తిరుపతి, రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి వంకల మాధవరావు, మద్దిల రామారావు, పత్తిరి దానేసు, వినోద్, వంకల షన్ముఖరావు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ పోటీలకు అంపైర్లుగా జిల్లావాసులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం

జాతీయ స్థాయి స్పోర్ట్స్‌మీట్‌కు జిల్లాకు చెందిన పీడీలు, కోచ్‌లు అంపైర్లుగా నియామకమయ్యారు. మూడో జాతీయ స్థాయి ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాలల స్పోర్ట్స్‌మీట్-2022 పేరిట గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ క్రీడా మైదానం వేదికగా ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పోటీలకు జిల్లా నుంచి పలు క్రీడాంశాల్లో పలువురు అంపైర్లు (టెక్నికల్ అఫీషియల్స్‌గా)గా వ్యవహరిస్తున్నారు. హ్యాండ్‌బాల్ పోటీలకు గురుగుబెల్లి రాజేశ్వరరావు (ఎస్‌ఎ పిఇ-జెడ్‌పి హెచ్‌ఎస్ పిల్లలవలస, పొందూరు), డి.ఈశ్వరరావు (ఎస్‌ఎ పిఇ-జెడ్‌పి హెచ్‌ఎస్ అల్లినగరం, ఎచ్చెర్ల), ఎల్.ఢిల్లేశ్వరరావు (ఎస్‌ఎ పిఇ-ఎంపియుపిఎస్ తండ్యాంవలస, శ్రీకాకుళం రూరల్), బాస్కెట్‌బాల్‌కు గాలి అర్జున్‌రావు రెడ్డి (డిఎస్‌ఎ కోచ్-శ్రీకాకుళం డిఎస్‌ఎ), వాలీబాల్‌కు కె.హరికృష్ణ (శాప్ కోచ్-శ్రీకాకుళం డిఎస్‌ఎ) అంపైర్లుగా వ్యవహరిస్తున్నారు. ఈమేరకు నిర్వహణ కమిటీ నుంచి నియామక ఉత్తర్వులు అందుకున్నారు. ఈనెల 22వ తేదీ వరకు నిర్వహించనున్న జాతీయస్థాయి గిరిజన క్రీడా పోటీలకు తొలిసారిగా ఆంధ్రప్రదేశ్ ఆతిథ్యాన్ని అందించిన విషయం విదితమే.


వినోద్ మిశ్రాకు నివాళులర్పిస్తున్న నాయకులు

వినోద్ మిశ్రా ఆశయాలను కొనసాగిద్దాం

ప్రజాశక్తి- పలాస

వినోద్ మిశ్రా ఆశయాలను కొనసాగిద్దామని సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కమిటీ సభ్యులు బొడ్డు వాసుదేవరావు అన్నారు. మండలంలోని బొడ్డపాడు పంచాయతీ పరిధిలో ఉన్న మామిడిపల్లి గ్రామంలో వినోద్ మిశ్రా 24వ వర్ధంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా సిపిఐ(ఎంఎల్)లిబరేషన్ జిల్లా లీడింగ్ టీం సభ్యులు వంకల ఆప్పయ్య వినోద్ మిశ్రా చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో అఖిల భారత గ్రామీణ కార్మిక సంఘం నాయకులు జడ్డే జోగారావు, సార పాపయ్య, ఆల్ ఇండియా సెంట్రల్ కౌన్సిల్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ మండల నాయకులు గేదెల జానకిరావు, మద్దిల చినబాబు, బొడ్డు విజయ,వి.పున్నయ్య, తవిటయ్యా,రామయ్య, పి.దేవరాజు పాల్గొన్నారు.


ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

గ్రంథాలయాల్లో 'చదవడం మాకిష్టం'

ప్రజాశక్తి- లావేరు

మండలంలోని మురపాక శాఖాగ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు వేమన శతకాలు, చిన్నచిన్న కథలు చెప్పారు. అనంతరం బాగా చదివిన ముగ్గురికి గ్రంథాలయం తరుపున గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు బహుమతులను అందజేశారు. గ్రంథాలయం ఆవరణలో విద్యార్థులతో చదవడం మాకిష్టం ప్రతిజ్ఞ, ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు జి.షణ్ముఖరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

అలాగే లావేరు శాఖాగ్రంథాలయంలోనూ చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. బాగా చదివిన ముగ్గురికి గ్రంథాలయాధికారి ఎం.శ్రీనివాసరావు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు ఎ.గడ్డియ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి పరామర్శ

సోంపేట: మండలంలోని శారదాపురం గ్రామానికి చెందిన కోరికన వీరస్వామి ఇటీవల మృతి చెందాడు. రాష్ట్ర గ్రీన్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ అధ్యక్షుడు నర్తు రామారావు ఆదివారం వీరస్వామి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కంచిలి జెడ్‌పిటిసి ప్రతినిధి ఇప్పిలి కృష్ణారావు, నాయకులు బి.పాపారావు, జి.ఢిల్లీరావు, బి.సారథి, బి.రుక్మాంగధరరావు, రాజారావు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణప్రియ

ప్రశ్నించేతత్వం పెరగాలి

పలాస : వైసిపి ప్రభుత్వం చేపట్టిన ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకించాలని, పాలకులు, అధికారులను ప్రశ్నించేతత్వం పెరగాలని ఎన్ఆర్‌ఐ కృష్ణప్రియ, బాపట్ల మాజీ ఎంపిపి విజేత పిలుపునిచ్చారు. పలాస టిడిపి కార్యాలయంలో ఆదివారం ఎన్ఆర్‌ఐ మహిళలతో మహిళా భేరి నిర్వహించారు. నియోజకవర్గంలోని మహిళా నేతలతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు ఏ విధంగా సమస్యలను ఎదుర్కొవాలి, ఓటర్లను ఎలా ప్రభావితం చేయాలి అనే దానిపై క్లుప్తంగా అవగాహన కల్పించారు. మహిళలు దేనిలో తక్కువ కాదని, మనం నడుంబిగించాలని, రానున్న ఎన్నికల్లో చంద్రబాబుని ముఖ్యమంత్రి చేసి బావితరాల భవిష్యత్‌కు పూలబాట వేయాలని పిలుపునిచ్చారు. కార్యాలయంలో టిడిపి మహిళాలు, తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్‌తో పురుగుల మందు పిచికారీ

డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ప్రాంతీయ మేనేజర్ హరిబాబు


డ్రోన్‌తో పురుగు మందుల పిచికారీ చేస్తున్న రైతులు (ఫైల్)

రణస్థలం: మొక్కజొన్నలో కత్తెర పురుగు నివారణకు డ్రోన్ వంటి ఆధునిక సాంకేతికతను వినియోగించడం వల్ల సిఫార్సు చేసిన రసాయనిక పురుగు మందులను 15 నిముషాల వ్యవధిలో ఎకరా పొలానికి పిచికారీ చేయవవచ్చని డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ప్రాంతీయ మేనేజర్ ఆర్.హరిబాబు అన్నారు. ఈ మేరకు ఆదివారం విలేకరులతో మాట్లాడారు. దీనివల్ల సమయంతో పాటు 180 లీటర్ల నీరు ఆదా అవుతుందన్నారు. శ్రమ కూడా తగ్గుతుందన్నారు. డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ వాతావరణ కార్యాచరణలో భాగంగా శ్రీకాకుళం సబ్ డివిజన్ పరిధిలో మొక్కజొన్న, అపరాల పంటలపై పురుగు మందుల పిచికారీకి అయ్యే ఖర్చులో 50 శాతం రాయితీపై డ్రోన్ యంత్రాలతో పిచికారీ చేయడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. మొక్కజొన్నపంట విత్తిన వారం రోజుల నుంచే సమస్యాత్మక కత్తెర పురుగు నివారణకు పలుమార్లు రసాయనిక పురుగు మందులను పిచికారీ చేయాల్సి వస్తోందన్నారు. దీనివల్ల రైతులు అదనంగా వేల రూపాయలు ఖర్చు చేయాల్సిన వస్తుందని చెప్పారు. సిఫార్సు చేసిన మందులను రైతులే సమకూర్చుకోవాలని సూచించారు. డ్రోన్ సేవలు వినియోగించుకోవాలనుకునే రైతులు ప్రణాళికా బద్ధమైన కార్యాచరణకు తమ పేర్లను ముందుగా నమోదు చేసుకుని సహకరించాలని కోరారు. గ్రామాల వారీగా కనీసం 10-20 ఎకరాలు ఒకే పరిధిలో ఉన్న ఎంత మంది రైతులు అయినా గ్రూపుగా నమోదు చేసుకోవచ్చని సూచించారు. మరింత సమాచారం కోసం తమ సంస్థ సమన్వయ కర్తలను పి.తవిటి నాయుడు, 9989284817, బి.లక్ష్మీనరసింహమూర్తి 9985542547, ఆర్.దేవుడుబాబు 8919531598 సెల్ నంబర్లను సంప్రదించాలన్నారు.

అధికారుల పర్యవేక్షణ లేకుండానే...

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలోని దూసి-తొగరాం ఆర్‌అండ్‌బి రోడ్డు నుంచి కంచరావానిపేట, తమ్మయ్యపేట, కనుగులవలస మీదుగా సిఎస్‌పి రోడ్డు 39/8 కిలోమీటర్ల వరకు రహదారి నిర్మాణానికి రూ.4.50 కోట్లు పిఎంజిఎస్‌వై ఫేజ్-3 నిధులు మంజూరయ్యాయి. ప్రస్తుతం రహదారి పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. కానీ, అధికారుల పర్యవేక్షణ లేకుండా ఇష్టానుసారంగా రోడ్డు నిర్మిస్తుండడంతో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ రహదారి నిర్మాణానికి 2020లో శంకుస్థాపన చేసారు. నేటికీ రెండేళ్లు పూర్తయినప్పటికీ పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఇన్నాళ్లకు పనులు ప్రారంభమైనప్పటికీ ఇష్టానుసారంగా జరుగుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. పొందూరు మండలంలో పంచాయతీరాజ్ ఎఇగా పనిచేస్తున్న సత్యనారాయణ అదనపు ఇన్‌ఛార్జిగా మండలంలో విధులు నిర్వహిస్తూ ఆయన పర్యవేక్షణలో రోడ్డు పనులు చేపడుతున్నాడు. ముద్దాడపేట, తమ్మయ్యపేట, కంచరావువానిపేట గ్రామస్తులు రోడ్డు నిర్మాణం జరుగుతున్న విధానంపై అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. ఎప్పటికైనా ఉన్నతాధికారులు రహదారి నిర్మాణంపై దృష్టి సారించి నాణ్యతతో కూడిన నిర్మాణాలను చేపట్టి త్వరితగతిన ప్రజలకు అంకితం చేయాలని పలు గ్రామాల ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు. రహదారి నిర్మాణ


అధికారుల పర్యవేక్షణ లేకుండా రోడ్డు నిర్మిస్తున్న కాంట్రాక్టర్

నాణ్యతపై పంచాయతీరాజ్ ఎఇ ఎస్.సత్యనారాయణను వివరణ కోరగా, రహదారి నిర్మాణం నాణ్యతతో ఆధునిక టెక్నాలజీతో నిర్మిస్తున్నామని తెలిపారు. చిలకపాలెంలోని తారు మిక్సింగ్ ప్లాంట్ వద్దకు వెళ్లి వచ్చేసరికి కొంత ఆలస్యం అయ్యిందని, అంతేగాని ఎటువంటి లోపాలు లేవని తెలిపారు.

విలేజ్ హెల్త్ క్లినిక్‌ల్లో అవకాశం కల్పించాలి

ప్రజాశక్తి- ఆమదాలవలస

గ్రామీణ వైద్యులకు విలేజ్ హెల్త్ క్లినిక్‌ల్లో అవకాశం కల్పించాలని కమ్యూనిటీ పారామెడికల్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్తారు రాజశేఖర్ ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. పట్టణంలోని వెంకట సాయి ల్యాబ్ ఆవరణలో పారామెడికల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఏరియా కమిటీ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పారా మెడికల్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు టి.భాస్కరరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పాదయాత్ర సందర్భంగా అధికారంలోకి వచ్చిన వెంటనే గ్రామీణ వైద్యుల సేవలను వినియోగించుకుంటామని జిఒ నంబరు 429ను అమలు చేస్తామని హామీను ఇచ్చారని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చి మూడున్నర ఏళ్లు కావస్తున్నా... కార్యరూపం దాల్చలేదని వాపోయారు. ఇప్పటికైనా ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఆమదాలవలస నూతన కమిటీ అధ్యక్షులుగా ముద్దాడ సింహాచలం, ఉపాధ్యక్షులుగా పాలకొండ రాజులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో గ్రామీణ వైద్యులు యండ విశ్వనాథం, అంకుల కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.


పుష్పగుచ్ఛం అందజేస్తున్న గ్రామీణ వైద్యులు

మాచర్ల ఘటన అప్రజాస్వామికం

ప్రజాశక్తి- పలాస

మాచర్ల సంఘటన అప్రజాస్వామికమని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న తెలుగుదేశం పార్టీ తన బాధ్యతగా రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరిస్తుంటే ఓర్వలేక టిడిపి నేతలపై వైసిపి నేతలు దాడులకు పాల్పడం అప్రజాస్వామికమని, దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. మాచర్లలో టిడిపి నాయకులపై దాడులకు పాల్పడినా పోలీసులు ప్రేక్షక పాత్ర వహించడం బాధాకరమని పేర్కొన్నారు. దాడులకు పాల్పడిన వారిని వదిలేసి టిడిపి నాయకులపై కేసులు పెట్టడం ఆశ్చర్యానికి గురిచేస్తుందని తెలిపారు. మాచర్ల ఘటన ప్రజాస్వామ్య వ్యవస్థలో ఒక దురదృష్ట సంఘటన, రాష్ట్రంలో ఈ దౌర్జన్య పరిపాలనపై కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించి ప్రజాస్వామ్యన్ని కాపాడాల్సిన అవసరం ఉందని తెలిపారు.

ఒడియా బ్రాహ్మణులు సంఘటితం కావాలి

ప్రజాశక్తి- పలాస

ఒడియా బ్రాహ్మణులంతా సంఘటితమై సమస్యల సాధనకు కృషి చేయాలని ఒడియా బ్రాహ్మణ సంఘ అధ్యక్షుడు చంద్రశేఖర్ త్యాడి అన్నారు. పలాస, వజ్రపుత్తూరు మండలం, పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీకి చెందిన ఒడియా బ్రాహ్మణులు ఆదివారం గండహతి జలాశయం వద్ద వన విహారం ఏర్పాటు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఒడియా బ్రాహ్మణులు ఎదుర్కొంటున్న సమస్యలు రామన్న సమావేశంలో చేపట్టాల్సిన కార్యాచరణ పనులపై వివరించారు. అనంతరము బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విందులో పాల్గొన్నారు. సంఘ కార్యదర్శి బాబురావు పండా, సభ్యులు నిత్యానంద పండా, పూజారి రవినారాయణ, పడ్డ సంతోష్‌కుమార్, ఈశ్వర్, మహిళలు పాల్గొన్నారు.


వన భోజనాల్లో ఒడియా బ్రాహ్మణులు


కొత్తూరు : మాట్లాడుతున్న వెంకటరమణ


కోటబొమ్మాళి : పోస్టర్‌ను ప్రదర్శిస్తున్న టిడిపి నాయకులు

అభివృద్ధిలో రాష్ట్రం వెనుకబాటు

కొత్తూరు : అభివృద్ధిలో రాష్ట్రం వెనుకబడిందని మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ అన్నారు. మండలంలోని ఇరపాడుగూడలో ఇదేం ఖర్మం మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించారు. అనంతరం మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వ హయాంలో రాష్ట్ర అభివృద్ధి ఆమడదూరంలో ఉందన్నారు. ప్రభుత్వ పాలనపై ప్రశ్నిస్తే కేసు పెట్టి భయపెడుతున్నారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నెల్లి అచ్యుత, టిడిపి నాయకులు కమలాకర్, ఎం.సీతారాం, ఎస్.మోహనరావు, సురేష్, సింహాచలం, మురళి, సురేష్, ముఖలింగం పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: కోటబొమ్మాళి 1,2 వార్డుల్లో టిడిపి మండల అధ్యక్షులు బోయిన రమేష్ అధ్యక్షతన ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను, పెరుగుతున్న ధరలను వివరించి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి తర్ర రామకృష్ణ, ఎంపిటిసి పట్ట సింహాచలం వెలమల విజయలక్ష్మి, కామేశ్వరరావు, కర్రి అప్పారావు, మాజీ సర్పంచ్‌లు పూజారి శైలజ, గొండు లక్ష్మణరావు, బాడాన రమణమ్మ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మాధవీలత

యోగాతో ఆరోగ్యం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

యోగా అభ్యసించడం వల్ల ప్రతి మనిషీ ఆరోగ్యంగా ఉండవచ్చని డిఎస్‌డిఒ మాధురీలత అన్నారు. యోగా క్లబ్ ఆధ్వర్యాన కొంక్యాన గోవిందరాజులు ఛారిటబుల్ ట్రస్టు, శిరిడీ సాయి యోగా సెంటర్, మారుతి వాకర్స్ క్లబ్ సంయుక్త నగరంలోని కోడిరామ్మూర్తి స్టేడియంలో ఆదివారం నిర్వహించిన శాప్ యోగా లీగ్-22-23న ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యోగానూ ప్రభుత్వం క్రీడల్లో ఒకటిగా గుర్తించిందన్నారు. విశ్రాంత జిల్లా జడ్జి పప్పల జగన్నాథరావు మాట్లాడుతూ యోగా ద్వారా ప్రతి మనిషీ ఎక్కువ కాలం జీవించే అవకాశం ఉంటుందన్నారు. ఎస్-ఎస్ఆర్ ట్రస్టు చైర్మన్ సూర శ్రీనివాసరావు మాట్లాడుతూ గోవిందరాజులు ఛారిటబుల్ ట్రస్టు ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుందని, అందులో యోగాకు ప్రాధాన్యతిస్తుందని పేర్కొన్నారు. వైసిపి నాయకులు చౌదరి సతీష్ మాట్లాడుతూ యోగా ద్వారా మనిషి మరింత ఆరోగ్యంగా, ఆనందంగా ఉండవచ్చునన్నారు. యోగా ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు, కృష్ణప్పపేట సర్పంచ్ గొండు శంకర్ మాట్లాడుతూ తాము ఎన్నో ఏళ్లుగా యోగా చేస్తున్నామని, తద్వారా ఆరోగ్యం మెరుగ్గా ఉండడంతో పాటు చురుగ్గా పనిచేసేందుకు అవకాశం కలుగుతుందని అన్నారు. ఎపిడబ్ల్యుఎఫ్ రాష్ట్ర కార్యదర్శి, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు కొంక్యాన వేణుగోపాల్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో మారుతి వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు కొంక్యాన మురళీధర్, వాకర్స్‌క్లబ్ మాజీ గవర్నర్ ఇందిరాప్రసాద్, షిరిడీ సాయి యోగా సెంటర్ ప్రతినిధి పాండురంగ మురళీకృష్ణ, యోగా గురువులు లగుడు అప్పన్న, దుంపల చిన్నబాబు, బొడ్డేపల్లి లక్ష్మీనారాయణ, మేనక, ఎలక్ట్రానిక్ మీడియా కన్వీనర్ జోగినాయుడు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రామ్‌మల్లిక్‌నాయుడు, నాగార్జునబాబు

జాబ్ క్యాలెండర్ ఏదీ?

ప్రజాశక్తి- జి.సిగడాం

నిరుద్యోగులకు ఏటా ఆజబ్ క్యాలెండర్ నిర్వహిస్తానని పాదయాత్రలో ఇచ్చి అధికారంలోకి వచ్చిన తరువాత సిఎం జగన్మోహన్‌రెడ్డిని లక్షలాది మంది నిరుద్యోగ యువతని దగా చేసి మోసం చేశాడని టిడిపి రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్‌నాయుడు, విజయనగరం పార్లమెంటరీ టిడిపి నాయకులు నాగార్జునబాబు విమర్శించారు. మండలంలోని రౌతుపేటలో ఐటిడిపి మండల అధ్యక్షుడు కిల్లానా చంద్రశేఖర్ వివాహంలో ఆదివారం పాల్గొన్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో విధ్వంసపాలన సాగుతుందన్నారు. తోటపల్లి, మడ్డువలస ప్రాజెక్టుల ద్వారా నీరు సకాలంలో అందకపోవడంతో రైతులు అవస్థలు పడ్డారని అన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు కుమరాపు రవికుమార్, సీనియర్ నాయకులు గోపాలకృష్ణంరాజు, భూపతి శ్రీరామ్మూర్తి, చిన్నారావు, గొల్లజీ పాల్గొన్నారు.

చైతన్యంతోనే మోసాలకు అడ్డుకట్ట

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు


మాట్లాడుతున్న చలం

వినియోగదారుల చైత న్యంతోనే వ్యాపారుల మోసాలకు అడ్డుకట్ట వేయగలమని, అందుకు వినియోగదారుల రక్షణ చట్టం వజ్రాయుధంగా పని చేస్తుందని వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర వైస్ చైర్మన్ ఎల్‌వి చలం అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో వినియోగదారుల ఎగ్జిక్యూటివ్ సభ్యులు దువ్వాడ జనార్ధనరావుతో కలిసి విలేకరులతో మాట్లాడారు. వినియోగదారుల వారోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. వస్తువులను కొనుగోలు చేసినపుడు వినియోగదారులకు నష్టం జరిగితే తగిన ఆధారాలతో వినియోగదారుల ఫోరంను ఆశ్రయించాలని కోరారు. వినియోగదారుల చట్టం 2019పై విస్తతంగా ప్రచారం చేస్తున్నట్లు తెలిపారు. వస్తువులను కొనుగోలు చేసినపుడు తగిన రశీదు పొందాలని, నగదు రహిత లావాదేవీలపై జాగ్రత్త వహించాలని కోరారు.


శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ సంజీవరావు

ఇంటింటికీ తాగునీరు

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ పైపులైన్లు వేసి స్వచ్ఛమైన తాగునీరు అందించటమే ప్రభుత్వ లక్ష్యమని కోటబొమ్మాళి మేజరు పంచాయతీ సర్పంచ్ కాళ్ల సంజీవరావు అన్నారు. మండలంలోని మంచాలపేటలో ఆదివారం జలజీవన్ మీషన్‌లో భాగంగా ఇంటింటి కుళాయి పనులకు పంచాయతీ కార్యదర్శి రఘుపాత్రుని యోగేశ్వరరావుతో కలిసి ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో కోటబొమ్మాళి పంచాయతీలో నివాసముంటున్న ప్రజలు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడేవారని గుర్తు చేశారు. వైసిపి అధికారంలోకి వచ్చిన తరువాత కొత్తగా బోర్లు వేసి రోజూ నీరు విడిచిపెడుతున్నామని అన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ అనపాన బాలకృష్ణ, వార్డు మెంబరు పంచిరెడ్డి కృష్ణమూర్తి, విద్యా కమిటీ చైర్మన్ పండిత్ గోవిందరావు, జీరు సింహాచలం పాల్గొన్నారు.

సకాలంలో రుణాలు చెల్లించాలి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మహిళా సంఘాలు తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించాలని వెలుగు ఎపిఎం ప్రసాదరావు సూచించారు. మండలంలోని తులసిగాం గ్రామ పంచాయతీలో గ్రామ సంఘం సమావేశం ఆదివారం నిర్వహించారు. స్త్రీనిధి గ్రామ సంఘం రుణాలు బకాయిలు రికవరీ చేశామన్నారు. వైఎస్ఆర్ ఆసరా బయోమెట్రిక్ చేశారు. సంఘాల బలోపేతం గురించి తీసుకోవాల్సిన చర్యలు, కట్టుబాట్లు వివరించారు. కార్యక్రమంలో సిసి మోహన్‌రావు, ఇన్‌ఛార్జి వివిఒ విజయ, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వెలుగు ఎపిఎం ప్రసాదరావు